క్లుప్తంగా

సచివాలయాల్లో ఆధార్ సేవలు

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ పరిధిలోని వార్డు సచివాలయాల్లో ఆధార్ కార్డు సంబంధిత సేవలు అందుబాటులోకి వచ్చినట్టు జెడ్సీ రాము తెలిపారు. ఒకటో వార్డు సంతోపేట సచివాలయం (అంబేడ్కరు సామాజిక భవనం), మూడో వార్డు తోటవీధి సచివాలయం (తోటవీధి సామాజిక భవనం)లో ప్రజలు ఆధార్ సంబంధిత సేవలు వినియోగించుకోవాలని కోరారు.

డస్ట్‌బిన్ల పంపిణీ



డస్ట్‌బిన్లు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ కొండబాబు

కొమ్మాది: జీవీఎంసీ 4వ వార్డు కాపులుప్పాడ సచివాలయ పరిధిలో 1,250 ఇళ్లల్లో నివసిస్తున్న వారి నుంచి తడి, పొడి చెత్త సేకరణకు డస్ట్‌బిన్లను కార్పొరేటర్ దౌలపల్లి కొండబాబు గురువారం పంపిణీ చేశారు. ప్రతి ఒక్కరూ చెత్తను వేర్వేరుగా జీవీఎంసీ పారిశుధ్య సిబ్బందికి అందించాలని కోరారు. కార్యక్రమంలో కన్వీనర్లు ఎరుసు అప్పలకొండ రెడ్డి, దేవాడ నాయుడు, సాడి రమణ, పాల నాయుడు, గుడ్ల కొండ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పద్య పఠనం అలవరచుకోవాలి




పద్మనాభంలో వేమన చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

పద్మనాభం: విద్యార్థినులంతా పద్యాలు నేర్చుకోవడం చాలా ముఖ్యమని సమగ్ర శిక్ష జిల్లా జీసీడీవో కాలేషా బేగం సూచించారు. పద్మనాభంలోని కస్తూర్బా విద్యాలయంలో గురువారం యోగి వేమన జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. యోగి వేమన రచనలు చాలా తేలికగా అర్థమవుతాయన్నారు. ఇవి నైతిక విలువలతో కూడినవని తెలిపారు. అనంతరం వేమన పద్యాలు పఠించిన విద్యార్థినులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గణిత శాస్త్ర నిపుణులు సతీష్, ఎన్ఆర్ఐ రాజశేఖర్, ఎస్‌వో గ్రేస్ లిల్లీ, సీఆర్టీలు పాల్గొన్నారు.

తగరపువలస: పామరులకు సైతం అర్థమయ్యేలా వేమన పద్యాలు ఉంటాయని జీవీఎంసీ భీమిలి జోన్ ఒకటో వార్డు బంగ్లామెట్ట ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రెడ్డిపల్లి అప్పలరాజు అన్నారు. వేమన జయంతి సందర్భంగా విద్యార్థులకు గురువారం ఆయన గురించి వివరించారు. 1839లో బ్రౌన్ ద్వారా వేమన పద్యాలు తొలిసారిగా వెలుగులోకి వచ్చాయన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నరహరిశెట్టి రమేష్, బుగత మల్లిక, పిన్నింటి నాగమణి తదితరులు పాల్గొన్నారు.

భీమిలి కేథరిన్ స్కూల్‌లో 4 నుంచి 9వ తరగతి వరకు విద్యార్థులకు వేమన పద్యాలపై పోటీలు నిర్వహించారు. వీరికి కేథరిన్ విద్యా సంస్థల చైర్మన్ ఆలీవర్ ఆర్ రాయి, ఉపాధ్యాయులు జయభారతి, పీఎస్ రావు బహుమతులు అందించారు.

లక్ష్మీపురం విద్యార్థికి అభినందనలు



బమ్మిడి సురేంద్ర

తగరపువలస: పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లి గూడెంలో ఈ నెల 21 నుంచి 24 వరకు నిర్వహించే స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్ - 14 రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు భీమిలి మండలం లక్ష్మీపురం జెడ్పీ హైస్కూల్ విద్యార్థి బమ్మిడి సురేంద్ర ఎంపికయ్యాడు. ఏడో తరగతి చదువుతున్న సురేంద్ర తమ పాఠశాల విద్యార్థి కావడం గర్వకారణమని ప్రధానోపాధ్యాయుడు గాడు పైడిరాజు అన్నారు. ఈ సందర్భంగా సురేంద్రను వ్యాయామ ఉపాధ్యాయుడు ఎస్.లలిత్ కుమార్, ఉపాధ్యాయులు బషీర్‌ఖాన్, పైడినాయుడు, నరసింహం, అంబిక, నిత్యానంద్, సుందరి, లక్ష్మి, శ్రీనివాస్, నీలంరెడ్డి అభినందించారు.

ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యం

- నెల రోజుల్లో రక్షణ గోడ నిర్మాణం పూర్తి
- ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



విద్యుత్ ఉద్యోగుల క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు



రక్షణ గోడ నిర్మాణానికి శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, తదితరులు

తగరపువలస: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తున్నామని, ప్రజల సమస్యలు తీర్చే ప్రభుత్వం తమదని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. జీవీఎంసీ భీమిలి జోన్ రెండో వార్డు సత్యనారాయణమెట్ట వాలు ప్రాంతంలో రూ.74 లక్షలతో నిర్మించనున్న రక్షణగోడను నెల రోజుల్లో పూర్తి చేయనున్నట్టు ఆయన తెలిపారు. ఇందుకోసం గురువారం సాయంత్రం ఆయన భూమిపూజ చేసి శిలాఫలకం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ఏడాది సెప్టెంబరు 8న రాత్రి వర్షాలకు కూలిపోయిన రక్షణ గోడను పటిష్టంగా నిర్మించి ఈ ప్రాంతం వారి కోరిక మేరకు డ్రైనేజీలు, బోరుబావి కూడా ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. అంతేకాకుండా తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి వాటర్ ట్యాంకు నిర్మాణానికి కూడా నెల రోజుల్లో భూమిపూజ చేస్తామన్నారు. ఇందుకోసం అధికారులు అంచనాలు రూపొందించాలని కోరారు. కార్యక్రమంలో జెడ్సీ బి.రాము, వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి శిల్లా సరళారాణి, కో ఆప్షన్ సభ్యురాలు కొప్పల ప్రభావతి, పార్టీ వార్డు అధ్యక్షుడు చిల్ల భాస్కరరెడ్డి, శిల్లా కరుణాకరరెడ్డి, చిప్పాడ వెంకటేష్, బింగి హరికిరణ్‌రెడ్డి, చిల్ల సూర్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగుల క్యాలెండర్ ఆవిష్కరణ

సత్యనారాయణమెట్ట వద్ద భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఏపీఈపీడీసీఎల్ ఉద్యోగుల క్యాలెండర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఈఈ పోలాకి శ్రీనివాసరావు, డీఈఈ ఆర్.రమేష్, ఏఈఈ బొట్టా రవి, సకరయ్య, జేఈ ఎం.వెంకటేశ్వరరావు, లైన్ ఇన్‌స్పెక్టర్ టి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రూ.54.30 లక్షల అభివృద్ధి పనులు ప్రారంభం

పీఎం పాలెం: జీవీఎంసీ ఆరో వార్డులోని పీఎం పాలెం పరిధిలో రూ. 52.30 లక్షలతో పూర్తి చేసిన అభివృద్ధి పనులను ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు గురువారం ప్రారంభించారు. స్థానిక హెచ్‌పీ నగర్‌లో పార్కును రూ. 12.30 లక్షలతో అభివృద్ధి చేసి ఓపెన్ జిమ్ సదుపాయం కల్పించారు. దీన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే శ్రీనివాసరావు మాట్లాడుతూ వాకింగ్ చేయడానికి ఇక్కడి ట్రాక్ ఎంతో అనుకూలంగా ఉంటుందన్నారు. ఓపెన్ జిమ్ పరికరాలతో వ్యాయామం చేస్తే మంచి ఆరోగ్యం లభిస్తుందని సూచించారు. అనంతరం హెచ్‌బీసీఎల్ లేఅవుట్‌లో రూ.40 లక్షలతో నిర్మించిన తారు రోడ్డు, సీసీ కల్వర్టులను ఆయన ప్రారంభించారు. కార్పొరేషన్ ఎన్నికల సమయంలో ఈ రోడ్డు అభివృద్ధి చేస్తామని ఇచ్చిన హామీని నెరవేర్చామని ఆయన స్థానికులకు గుర్తు చేశారు. కార్యక్రమంలో జెడ్సీ కనక మహాలక్ష్మి, వైఎస్సార్ సీపీ 6, 7 వార్డుల అధ్యక్షులు బొట్ట అప్పారావు, పోతిన శ్రీనివాసరావు, స్థానిక నాయకులు కె.వరలక్ష్మి, గాదె రోశిరెడ్డి, జేఎస్ రెడ్డి, పోతిన యల్లాజీ, రాయిన సాయికుమార్, కె.రామారావు పాల్గొన్నారు.



పార్కులో జిమ్ ఉపకరణాలతో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

నవోదయ విద్యార్థులకు అభినందనలు



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ సంజయ్

కొమ్మాది: విశాఖ ఇందిర ప్రియదర్శిని మున్సిపల్ స్టేడియంలో జరిగిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్థాయి జూనియర్ సబ్, జూనియర్ పారా అథ్లెటిక్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో ప్రతిభ కనబరిచి వివిధ పోటీల్లో పతకాలు సాధించిన కొమ్మాది నవోదయ విద్యార్థులను ప్రిన్సిపాల్ కె.సంజయ్ గురువారం అభినందించారు. 8వ తరగతి చదువుతున్న విద్యార్థి కె.తేజశ్రీ 100 మీటర్ల స్ప్రింట్ విభాగంలో స్వర్ణ పతకం, 400 మీటర్ల స్ప్రింట్ విభాగంలో రజత పతకం గెలుపొంది ఈ నెల 27న గుజరాత్‌లో నిర్వహించే జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. 6వ తరగతి విద్యార్థి సాల్మన్ కుమార్ 100, 400 మీటర్ల స్ప్రింట్ విభాగంలో కాంస్య పతకం, 7వ తరగతి విద్యార్థిని జి.తేజశ్విని 100 మీటర్ల విభాగంలో కాంస్య పతకం, 9వ తరగతి విద్యార్థిని కృష్ణ తేజశ్విని షాట్‌పుట్ విభాగంలో కాంస్య పతకం సాధించారు. ఈ సందర్భంగా పతకాలు సాధించిన విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

కార్మికుల బకాయిలు చెల్లించేందుకు సిద్ధం

ఇంటక్ నాయకులతో సమావేశంలో జేసీఎల్



జేసీఎల్‌తో చిట్టివలస జ్యూట్‌మిల్లు ఇంటక్ నాయకులు

తగరపువలస: చిట్టివలస జ్యూట్‌మిల్లులో కార్మికులకు చెల్లించాల్సిన బకాయిల నిమిత్తం గురువారం నగరంలోని జాయింట్ లేబర్ కమిషనర్ రామారావును ఇంటక్ అధ్యక్షుడు కాకర్లపూడి వరహాలరాజు ఆధ్వర్యంలో నాయకులు కలిశారు. ఈ సందర్భంగా జరిగిన చర్చల్లో జేసీఎల్ మాట్లాడుతూ ఇప్పటి వరకు దరఖాస్తు చేసుకున్న కార్మికులకు బకాయిలు చెల్లించడానికి యాజమాన్యం సిద్ధంగా ఉన్నట్టు తెలిపారు. అనంతరం వరహాలరాజు మాట్లాడుతూ భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఆదేశాలతో కార్మికులకు సూచనలు, సలహాల నిమిత్తం మిల్లు గేటు వద్ద రోజూ కౌంటర్ తెరిచి ఉంచుతున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా యాజమాన్యం చెల్లించాల్సిన కార్మికుల బకాయిల జాబితాను జేసీఎల్‌కు అందించారు. ఇప్పటి వరకు దరఖాస్తు చేసుకోని కార్మికులు, అప్రెంటీస్‌లు తమ డిపార్ట్‌మెంట్ల ప్రకారం వెంటనే దరఖాస్తు చేసుకోవాలన్నారు. సమావేశంలో మిల్లు ప్రతినిధులు లలిత్‌కుమార్, రామ్‌కుమార్, ఇంటక్ నాయకులు చిల్ల వెంకటరమణ, జీరు వెంకటరెడ్డి, సరగడ సూరిబాబు, బొడ్డు నరసింగరావు, పూసర్ల నరసింగరావు, సరగడ శ్రీరామమూర్తి, చిల్ల చిదంబరం, రిక్క నరసింహులు, కొయ్య అప్పలచిట్టి, ఎరుసు స్వామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీచ్‌పార్కులో కొత్త అందాలు



పార్కులో ఏర్పాటు చేసిన గడ్డి, పువ్వుల మొక్కలు

భీమునిపట్నం: భీమిలి బీచ్‌పార్కు ఆధునికీకరణ పనులను అధికారులు చేపట్టారు. గతంలో ఈ పార్కు చాలా విశాలంగా ఉండేది. ఇందులో బొమ్మలు, ఫౌంటెన్, సందర్శకులు సేద తీరడానికి సిమెంట్ గొడుగులు ఉండేవి. దీంతో రోజూ సందర్శకులతో ఈ ప్రాంతం ఎంతో సందడిగా ఉండేది. అయితే 2014లో వచ్చిన హుద్‌హుద్ తుఫాను ప్రభావంతో పార్కులోని సగ భాగం సముద్రంలో కలిసిపోయింది. దాంతోపాటు బొమ్మలు, గొడుగులు, బెంచీలు కనుమరుగైపోయాయి. ప్రస్తుతం కొద్దిపాటి బొమ్మలు మాత్రమే ఉన్నాయి. ఈ క్రమంలో అధికారులు ఇప్పుడు ఉన్న పార్కును ఆధునికీకరించే పనులు చేపట్టారు. అందులో భాగంగా జీవీఎంసీ ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో రూ.17లక్షలతో పార్కులో గడ్డితోపాటు పలు రకాల పువ్వుల మొక్కలు ఏర్పాటు చేస్తున్నారు. దీంతో ఇప్పటి వరకు కళావిహీనంగా ఉన్న పార్కు కొత్త అందాలతో అందరినీ ఆకట్టుకుంటోంది.

జంతు సంరక్షణ చట్టాలు గౌరవించాలి



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ దత్త

కొమ్మాది: ఔషధ ప్రయోగాలకు జంతువులను వినియోగించే పరిశోధకులు జంతు సంరక్షణ చట్టాలను విధిగా గౌరవించాలని భారత ప్రభుత్వ జంతు సంక్షేమ విభాగం సంయుక్త కమిషనర్, కమిటీ ఫర్ కంట్రోల్ అండ్ సూపర్‌విజన్ ఆఫ్ ఎక్స్‌పరిమెంట్స్ ఆన్ యానిమల్స్ మెంబర్ సెక్రటరీ డాక్టర్ ఎస్‌కే దత్త సూచించారు. గీతం వేదికగా దక్షిణాది రాష్ట్రాల విశ్వవిద్యాలయాల ఫార్మసీ కళాశాలల్లోని పరిశోధకులకు కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ఎంతో అవసరం అనుకుంటే తప్ప జంతువులపై ప్రయోగాలు జరుపరాదన్నారు. మనుషుల వలే జంతువులకు మానసిక, శారీరక ఆరోగ్యం అవసరమని, అది లోపిస్తే దాని ప్రభావం మానవ సమాజంపై పడుతుందనే విషయాన్ని గుర్తించాలన్నారు. సమావేశంలో పలువురు పరిశోధకులు పాల్గొన్నారు.

అనుమానాస్పదంగా యువకుడి మృతి



ముడసల శ్రీను (ఫైల్)

తగరపువలస: ఆనందపురం మండలం ఎగువ యాతపేటకు చెందిన ముడసల శ్రీను (33) అనే గీత కార్మికుని మృతదేహం గురువారం తగరపువలస గోస్తనీ నదిలో లభ్యమయింది. మృతుని తల్లి అప్పల నరసయ్యమ్మ భీమిలి పోలీసులకు చేసిన ఫిర్యాదు ఇలా ఉంది. తొమ్మిది సంవత్సరాల క్రితం శ్రీనుకు భీమిలి మండలం శింగనబంద పంచాయతీ కృష్ణంరాజుపేటకు చెందిన రీసు గురమ్మ(చిన్నారి)తో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమార్తెలు సంతానం. సంక్రాంతి పండగ సందర్భంగా ఈ నెల 15న సాయంత్రం కృష్ణంరాజుపేటలోని అత్తారింటికి శ్రీను వచ్చాడు. 17న భార్య గురమ్మ, తోడల్లుడు రాము, అత్తామామలు, తదితర కుటుంబ సభ్యులతో శ్రీనుకు గొడవ జరిగింది. అదేరోజు రాత్రి 7 గంటల సమయంలో శ్రీను బయటకు వెళ్లిపోయినట్టు గురమ్మ ఆనందపురంలో అత్తవారింటికి ఫోన్‌లో సమాచారం అందించింది. దీంతో అందరూ ఈ నెల 18న శ్రీను ఆచూకీ కోసం ప్రయత్నించినా ఎక్కడా లభించలేదు. గురువారం జాతీయ రహదారి గోస్తనీ నది వంతెన వద్ద లభించిన మృతదేహాన్ని చూడగా శ్రీనుదిగా బంధువులు గుర్తించారు. దీంతో అత్తారింట్లో జరిగిన గొడవ కారణంగా మనస్తాపంతో శ్రీను ఆత్మహత్య చేసుకోవడమో..? లేదా ఎవరైనా హత్య చేసి ఉంటారేమోనని కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. పోస్టుమార్టం నివేదిక వచ్చే వరకు ఆత్మహత్యగా కేసు నమోదు చేసినట్టు భీమిలి సీఐ కె.లక్ష్మణమూర్తి తెలిపారు.

పీఎం శ్రీ పథకం అమలుకు పాఠశాలల పరిశీలన



బొడ్డపాలెం పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న డీడీ వెంకటలక్ష్మి

ఆనందపురం : జాతీయ స్థాయి ప్రమాణాలతో ప్రధాన మంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా (పీఎం శ్రీ) పథకంలో చోటు కల్పించడానికి ఎంపిక చేసిన పాఠశాలల్లో గల వాస్తవ సౌకర్యాలు ఎలా ఉన్నాయి అన్న విషయమై విద్యా శాఖాధికారులు గురువారం పరిశీలించారు. విద్యాశాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎం.వెంకటలక్ష్మి, ఎంఈవో ఎస్ఎస్ పద్మావతి తదితరులు మండలంలోని ఆనందపురం, శొంఠ్యాం హైస్కూళ్లు, బోయిపాలెం, లొడగలవానిపాలెం ప్రాథమిక పాఠశాలలు, బొడ్డపాలెంలో ప్రాథమికోన్నత పాఠశాలను సందర్శించారు. ఈ పాఠశాలల స్థితిగతులను ఇది వరకే నివేదిక రూపంలో విద్యాశాఖ కేంద్రానికి అందజేసింది. ఈ సందర్భంగా బొడ్డపాలెం పాఠశాలలో 5, 8 తరగతుల విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాన్ని పరీక్షించారు. ఆనందపురం హైస్కూల్‌లో గ్రంథాలయాన్ని, లొడగలవానిపాలెం పాఠశాలలో టీవీ ద్వారా పాఠాలు బోధన, మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. ఉపాధ్యాయులతో సమావేశమై పలు విషయాలపై చర్చించారు.

పీఎం శ్రీతో పాఠశాలలు మరింత అభివృద్ధి

పద్మనాభం: పీఎం శ్రీ ద్వారా రాష్ట్రంలోని పాఠశాలలు మరింత అభివృద్ధి చెందుతాయని పీఎం శ్రీ రాష్ట్ర స్పెషలాఫీసర్ వెంకటలక్ష్మి అన్నారు. మండలంలో పీఎం శ్రీకి ఎంపిక చేసిన రౌతులపాలెం, అనంతవరం, ప్రాథమిక పాఠశాలలు, రెడ్డిపల్లి, ఆర్.వి.పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను గురువారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా వెంకటలక్ష్మి మాట్లాడారు. 'నాడు - నేడు' పథకంతో ఇప్పటికే రాష్ట్రంలోని పాఠశాలలను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అభివృద్ధి చేసిందన్నారు. పీఎం శ్రీ ద్వారా పాఠశాలల్లో మరిన్ని సౌకర్యాలు కల్పిస్తారన్నారు. ఈ సందర్భంగా ఆమె సైన్సు ల్యాబ్‌లు, మరుగుదొడ్లు, వంటశాలలు, తల్లిదండ్రుల కమిటీ సమావేశాల రిజిస్టర్లు, మధ్యాహ్న భోజన పథకం అమలు తీరు, తరగతి గదులు, పాఠశాలల పరిసర ప్రాంతాలను పరిశీలించారు. ఆమె వెంట సమగ్ర శిక్ష అభియాన్ జిల్లా అకడమిక్ మోనిటరింగ్ ఆఫీసర్ ఎ.శ్రీనివాసరావు ఉన్నారు.

'వైఎస్సార్‌సీపీ పరిపాలన చాలా బాగుంది'



నమ్మివానిపేట కాలనీలో మహిళకు కరపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

ఆనందం వ్యక్తం చేసిన రెండో వార్డు ప్రజలు

తగరపువలస: గత మూడున్నరేళ్లలో సాగిన వైఎస్సార్‌సీపీ పరిపాలన చాలా బాగుందని జీవీఎంసీ రెండో వార్డు నమ్మివానిపేట కాలనీ, యాత కుమ్మరిపాలెం వాసులు ఆనందం వ్యక్తం చేశారు. గురువారం సాయంత్రం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా స్థానికుల సమస్యలు ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అడిగి తెలుసుకున్నారు. అర్హులకు సంక్షేమ పథకాలు అందకపోతే వార్డు సచివాలయాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సచివాలయ సిబ్బంది కూడా తమ వద్దకు వచ్చే వారిని విసిగించకుండా ఓపికగా సమస్యలు విని పరిష్కారం చూపాలన్నారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మళ్లీ రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ జెండా రెపరెపలాడాలన్నారు. అవినీతి రహిత సంక్షేమ పాలనకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేశారన్నారు. నమ్మివానిపేట కాలనీని ఆనుకుని ఉన్న శ్మశానవాటిక ప్రహరీ, పార్కు అభివృద్ధి, డ్రైనేజీలు, సీసీరోడ్లు, ఇంటింటికీ కుళాయిలు, సర్వే నంబర్ 89/2 ప్రభుత్వ భూమిలో కల్యాణ మండపం నిర్మాణం, యాత కుమ్మరిపాలెంలో కల్యాణ మండపం, సీసీ రోడ్లు నిర్మించాలని స్థానికులు ఎమ్మెల్యేను కోరారు. వీటిపై ఆయన స్పందిస్తూ పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

వారానికోసారి ఫాగింగ్ చేయాల్సిందే

దోమల సమస్యలను స్థానికులు ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు దృష్టికి తీసుకురాగా ఆయన అధికారులను ప్రశ్నించారు. దోమల నిర్మూలనకు అధిక ప్రాధాన్యమివ్వాలని ఆదేశించారు. విధిగా వారానికి ఒక్కసారి ఫాగింగ్ జరిగేలా చూడాలన్నారు. కార్యక్రమంలో జెడ్సీ బి.రాము, జీవీఎంసీ కో ఆప్షన్ సభ్యురాలు కొప్పల ప్రభావతి, వార్డు ఇన్‌చార్జి శిల్లా సరళారాణి, అధ్యక్షుడు చిల్ల భాస్కరరెడ్డి, ఎస్.కరుణాకరరెడ్డి, జీరు సుజాత, బింగి హరికిరణ్‌రెడ్డి, చిప్పాడ వెంకటేష్, డబ్బీరు ప్రశాంతి, భాగం స్వాతి సుధాకర్, చిల్ల ప్రమీల, నమ్మి మాధవ, గడిదీసు సూరిబాబు, మద్ది మహాలక్ష్మి, జీరు పద్మ, చేట్ల అప్పలసూరమ్మ, చేట్ల నరసింగరావు, వాసుపల్లి నరేంద్ర, కంచుమాని వెంకటరావు, జగన్నాథ ఎల్లాజీ, చేట్ల శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శం

ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

పీఎంపాలెం: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తీసుకొచ్చిన గ్రామ సచివాలయ, వలంటీర్ వ్యవస్థలు ప్రధాని నరేంద్ర మోదీ ప్రశంసలు అందుకున్నాయని, ఇవి దేశానికే ఆదర్శమని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. పీఎం పాలెంలోని అవంతి ఫంక్షన్ హాలులో మధురవాడ జోన్ - 2 పరిధిలోని 5, 6, 7, 8 వార్డుల వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, సచివాలయ వలంటీర్ల సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వలంటీర్ వ్యవస్థ వల్లే గడప గడపకూ సుపరిపాలన అందుతోందన్నారు. టీడీపీ నాయకులు, కొన్ని పత్రికలు తప్పుడు ప్రచారం చేసినంత మాత్రాన ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. ప్రజలకు సేవ చేసేందుకు వలంటీర్లకు గొప్ప అవకాశం లభించిందన్నారు. ప్రస్తుతం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఇలాగే కొనసాగాలంటే మరలా జగన్ మోహన్ రెడ్డినే రాష్ట్ర ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. ఇందుకోసం వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, క్లస్టర్ ఇన్‌చార్జిలు, కన్వీనర్లు, గృహసారథులు చిత్తశుద్ధితో కృషి చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో 8వ వార్డు కార్పొరేటర్ లొడగల అప్పారావు, జెడ్సీ కనక మహాలక్ష్మి, వైఎస్సార్ సీపీ 5, 6, 7 వార్డుల అధ్యక్షులు పోతిన హనుమంతరావు, బొట్ట అప్పలరాజు, పోతిన శ్రీనివాసరావు, నాయకులు కె.వరలక్ష్మి, రజని, గాదె రోశిరెడ్డి, జేఎస్ రెడ్డి, పోతిన యల్లాజీ, కె.రామారావు, జామి శివకుమార్, సాయికుమార్, రవి, నరసింగరావు తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

ఆనందపురం : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు నియమితులైన సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం మండలంలోని నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, సచివాలయ కన్వీనర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వం అమలు పరుస్తున్న సంక్షేమ పథకాలను ఇంటింటికీ వెళ్లి వివరించాలన్నారు. తద్వారా పార్టీని కూడా బలోపేతం చేయడానికి కన్వీనర్లు, గృహ సారథుల వ్యవస్థను తీసుకొచ్చారన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లగలిగి, నిజాయతీగా పని చేయడంతోపాటు పార్టీ పట్ల అంకితభావంతో ఉన్న వారిని వలంటీర్లకు అనుబంధంగా గృహ సారథులుగా నియమించాలన్నారు. రాబోయే ఎన్నికల్లో 175 స్థానాలకు 175 గెలవడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పని చేయాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ భీమిలి నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్తంశెట్టి మహేష్, జెడ్పీటీసీ సభ్యుడు కోరాడ వెంకటరావు, పార్టీ మండల అధ్యక్షుడు బంక సత్యం, మజ్జి వెంకటరావు, మండల ఉపాధ్యక్షుడు పాండ్రంకి శ్రీను, నాయకులు బొట్టా రామకృష్ణ, బంటుబిల్లి మణిశంకర నాయుడు, కోరాడ అప్పలస్వామి నాయుడు, దోల దేవుడు, లెంక రాంబాబు, కోరాడ ముసలినాయుడు, బీఆర్‌బీ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఫుట్ బ్రిడ్జి నిర్మించాలని డిమాండ్



మురుగు కాల్వలో నుంచి రాకపోకలు సాగిస్తున్న స్థానికులు

మధురవాడ: మధురవాడ జోన్‌లోని కళానగర్ - వాంబే కాలనీ మధ్య రాకపోకలకు గెడ్డ అడ్డంగా ఉందని, దానిపై ఫుట్ బ్రిడ్జి నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు. ఈ ప్రాంతాలకు యూపీహెచ్‌సీ, వార్డు సచివాలయం వాంబేకాలనీలోనే ఉన్నాయి. ఈ రెండు ప్రాంతాలను అనుకుని ఉన్న పరిసర ప్రాంతాల వారు ఆస్పత్రి, చదువులు, అంగన్‌వాడీ వంటి వాటి కోసం నిత్యం రాకపోకలు కొనసాగించాల్సి ఉంటుంది. ఈ రెండు ప్రాంతాలు కలిసి ఉన్నప్పటికీ గెడ్డ మాత్రమే అడ్డుగా ఉంది. దీనిని దాటలేక చుట్టూ తిరిగి వెళ్తే కిలో మీటరున్నర దూరం ప్రయాణించాల్సి వస్తోంది. ఈ గెడ్డలో నుంచి వెళ్తే 100 మీటర్లు మాత్రమే దూరం ఉంటుంది. అయితే ఈ ప్రాంతాలకు చెందిన ప్రజలు చుట్టూ తిరిగి వెళ్లలేక ఈ గెడ్డలో నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గెడ్డపై ఫుట్ బ్రిడ్జి నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.